ఛత్రపాణి

పి. గణపతిశాస్త్రి

౧

"నిలుచున్నపాటుగా నీవు ప్రసేనజిన్మహారాజు సన్నిధిని రావాలి! ఇది ప్రభువారి ఆజ్ఞ!"

అని హుంకరించాడు రాజకంచుకి! గౌతమబుద్ధదేవుని శ్రీపాదపద్మాలకు సభక్తికంగా ప్రణమిల్లి ధమ్మపదగాథాపారాయణము చేసుకుంటూ మెల్లమెల్లగా తన గృహానికి సాగిపోయే ఛత్రపాణి యీ ఆజ్ఞ విని నిలువునా నిర్ఘాంతపోయాడు! రాజకంచుకి ఆ విధంగా తనపై హుంకరించడానికి గల కారణమేమో అతనికి బోధపడలేదు. మహారాజసేవకులెంతటి అల్పాల్పులైనా ప్రభువుల చిత్తవృత్తినిబట్టి ఒక్కొక్కప్పుడు తామే మహారాజులన్నట్టుగా మిడిసిపడిపోవడం కద్దు! కంచుకి ఆవిధంగా మిడిసిపడిపోవడానికి ప్రసేనజిన్మహారాజు చిత్తవృత్తే హేతువై ఉండవచ్చునేమో! మహారాజావిధంగా తనపై ఆగ్రహించడానికి కారణమేమిటి చెప్మా! అని ఛత్రపాణి అనేకవిధాలుగా మథనపడ్డాడు. కాని వెంటనే రాజకంచుకితో కలిసి మహారాజు కొలువుకూటానికి బయలుదేరాడు.

ఛత్రపాణి శ్రావస్తీ నగరంలో చాలా సామాన్య గృహస్థు. తన సంసార జంజాటమేమో తానేమో తప్ప ఇరుగు పొరుగుల గొడవలేమీ పట్టించుకోడు. ఇక రాజాధికారులు, శ్రావస్తీనగర శ్రేష్ఠులు మొదలైన వారి దరిమానానికైనా వెళ్ళడు! ఏదో తనకు కలిగినదానితోనే సంతృప్తిపడి సుఖంగా సంసారయాత్ర సాగించుకుంటున్నాడు.

ఆ నిరంతర సంసారయాత్రలో క్రమంగా అతనికి అరవైయోపడి దాటిపోయింది. కలిగిన సంతానంలో కొంతమంది ప్రయోజకులై చేతికి అందివచ్చారుగాని ఇంకా చిన్నవాళ్లు ఇద్దరు ముగ్గురుదాకా మిగిలారు. ఆ వార్ధకభారంలో క్రుంగి కృశించిపోతూ అతడొకమారు గౌతమదేవుని సందర్శించి బౌద్ధధర్మ శ్రోతాపన్నుడైనాడు. ప్రశాంతంగా సంసారయాత్ర సాగిస్తూ ఒకరి జోలీ సొంటీ లేకుండా కాలక్షేపం చేసే ఛత్రపాణిని చూచి ఇరుగుపొరుగు గృహస్థులు కొందరు "ఈయన ఎంత బిగువులు పోతాడయ్యా!" అని అనుకోవడం కూడా పరిపాటే! మరికొందరింకా కొంతదూరం దాకా వెళ్ళి అతనికి 'ఛత్రపాణి' అని ఒక నూతన నామధేయంకూడా ప్రసాదించారు. నిజనామధేయ మేమైనా కొన్నాళ్ళకది అతనిపేరై కూర్చుంది.

దానికొక చిన్న కారణంకూడా ఉంది. వీథిలో ఎప్పుడడుగుపెట్టినా అతనికి చేతిలో గొడుగు, కాళ్ళకు పాదరక్షలు ఉండితీరవలసిందే! శిశిరఋతువులోకూడా అతడా గొడుగు లేనిదే వీథిలో అడుగుపెట్టేవాడు కాదు. హోరని వాన పడుతున్నా పాదాలకు పాదరక్షలుండి తీరవలసిందే. అతడవి రెండు ప్రత్యేకంగా తయారుచేయించుకొన్నాడు. లేతలేత తాటిముర్వులతో క్రొత్తగా గొడుగు తయారైవచ్చేసరికి అతని హృదయం ఒక్కమారుగా వేయిరేకుల తామరపువ్వులా వికసించింది! నల్లమద్దిమ్రాను చేవతో తయారయిన పాదరక్షలు తొడుక్కోగానే అతనిలో ఒక నూతనచైతన్యం ప్రవహించినట్లయింది! అంతకంటె అతనికి ప్రత్యేకంగా చెప్పుకోదగిన భోగభాగ్యాలేవీ లేవు! పదిమందిపిల్లలున్న సంసారయాత్రలో అతనికావిధమైన భోగతృష్ణ ఎన్నడు కలగలేదుకూడాను.

అయితే ఆ గొడుగు, పాదరక్షలు మాత్రం ఎంతో ప్రాణప్రదంగా చూచుకొంటూండేవాడు. ఇరుగు పొరుగు కొంటెపిల్లలు కొందరది గమనించి అతనికి ఛత్రపాణి అని పేరుపెట్టారు. క్రమంగా అది ఇరుగు పొరుగు పెద్దలకు కూడా అలవాటయింది. పడ్డవాళ్లెన్నడు చెడ్డవారు కారుగదా! అని అతడా మాట వినీవినిపించుకోనట్లుగా తలవంచుకు వెళ్లిపోయేవాడు. అలాగ ఎవరి మనస్సు నొప్పించకుండా తప్పించుకు తిరిగే తన నీ విధంగా ప్రసేనజన్మహారాజాహ్వానించవలసినంత అవసరం ఏమికలిగింది? అంతటి ప్రభువులకు తనవంటి అల్పులతో ప్రసంగించవలసిన అవసరం ఏమి ఉంటుంది కనక! అని అనేకవిధాలుగా మథనపడ్డాడు ఛత్రపాణి.

కొంతసేపటికి కంచుకితో కలిసి ప్రసేనజిన్మహారాజు కొలువుకూటం చేరుకున్నాడు. జీవితంలో ఎన్నడు అతడా కొలువుకూటం సందర్శించి ఉండలేదు. సువర్ణసింహాసనంతో తళతళలాడే కొలువుకూటం చూచేసరికి అతని కళ్లు జిగేలుమన్నాయి. అంతలోనే కంచుకి అక్కడినించి వెళ్లిపోయాడు. తన రాక ప్రభువులకు తెలుపుదు చెయ్యడానికే కంచుకి లోపలికి వెళ్లిఉంటాడని ఛత్రపాణి ఊహించుకొన్నాడు. అయితే అతనికి ఏమి చెయ్యడానికీ పాలుపోలేదు. ఎక్కడైనా కూర్చుంటే ఏమితప్పో! ఊరికే అలాగ నిలబడివుంటే ఏమితప్పో! అని అనేకవిధాలుగా తటపటాయించాడు. చివరికక్కడ ఎవరు లేకపోయినా రెండుచేతులతోను నుదుటిపై దోసిలికట్టి అత్యంత భయభక్తులతో మహారాజు రాక ఎదురుచూస్తూ నిలుచున్నాడు.

కొంతసేపటికి మహారాజు కొలువుకూటంలో ప్రవేశించాడు. ఠీవిగా సింహాసనంమీద కూర్చున్నాడు.

మహారాజు కొలువుకూటం లోపల అడుగుపెట్టగానే ఛత్రపాణి ఆయన కొకమారు నమస్కరించి తిరిగీ అలాగే నుదుటిపై దోసిలిఒగ్గ నిలుచున్నాడు. అలాగ కొంతసేపు గడిచిపోయింది. క్రమంగా కొంతసేపటికి ఛత్రపాణికి మహారాజు తనవైపు తిలకించాడా లేదా అని అనుమానం బయలుదేరింది. ప్రసేనజిత్తు లోపలికి వస్తూనే సింహాసనంమీద కూర్చుని నిరంతర రాజ్యకార్యతత్పరతలో నిమగ్నుడైనాడు. పార్శ్వాలలో నిలుచున్న చామరగ్రాహిణు లిద్దరు అలవోకగా ఆయనకు వింజామరలు వీస్తున్నారు. అలాగలాగ ఒక అరగడియ గడిచిపోయింది. అయినా ప్రసేనజిత్తు ఛత్రపాణివైపొకమారైనా కన్నెత్తి చూడలేదు. 'ఒకవేళ చూచినా చూడనట్లుగానే నటి

ప్రాచీన గాథాలహరి

★ ఛత్రపాణి ★

స్తున్నారేమో మహారాజా!' అనుకొన్నాడు ఛత్రపాణి! అదీగాక మహారాజాముఖంలో క్రోధరక్తిమ కూడా పొడకట్టింది. ఛత్రపాణి మళ్లీ మథనలో పడ్డాడు. అంతలో హఠాత్తుగా అతనికి గత దివసం సాయంకాలవేళ తథాగతుని చరణసన్నిధిని జరిగిన వృత్తాంతం అంతా జ్ఞాపకం వచ్చింది. వెంటనే మహారాజ క్రోధాని కొకవేళ అదే కారణమేమో అని అనిపించింది. కాని దానిలో అతనికి తన తప్పిదమేమీ కనిపించలేదు. అయినా అతనికా విషయం అంతా స్ఫురణకు రావడానికి కొక చిన్న కారణం కూడా లేకపోలేదు.

2

శాక్యసింహుడు శ్రావస్తీనగరానికి విచ్చేసి నప్పటినించీ ఛత్రపాణి ప్రతిదినము సాయంకాలవేళ ఆయన దర్శనం చేసుకోనిదే నిద్రపోయేవాడు కాదు. ఏకభుక్తం చేసి ధర్మగాథాపారాయణంతోనే తనకాలం అంతా వెళ్లబుచ్చుకొనేవాడు.

ఛత్రపాణి గత దివసం సాయంకాలం వేళ గౌతమదేవుని దర్శనం చేసినప్పుడు తలవని తలంపుగా ఒక చిన్న విశేషం జరిగింది.

ఛత్రపాణి అత్యంత భక్తిశ్రద్ధలతో తథాగతుని ఉపదేశా లాలకిస్తున్నాడు. సరిగ్గా అదేసమయంలో ప్రసేనజిన్మహారాజక్కడికి విచ్చేయనున్నారనేవార్త అతని చెవుల బడింది. అయినా అతడావిషయం ఆలోచించకుండా అలాగే కూర్చుని బుద్ధదేవుని ఉపదేశామృతం ఆస్వాదిస్తున్నాడు.

అంతలోనే మహారాజు లోపలికి విచ్చేశాడు. సవినయంగా బుద్ధదేవునికి నమస్కరించి ఒక నిమిషం సేపలాగే నిలుచున్నాడు.

ఆయన తథాగతుని సన్నిధికిరాగానే ఛత్రపాణి లేచి నిలబడి, సవినయంగా ప్రత్యభివాదం చెయ్యాలని అనుకున్నాడు. కాని ఉత్తరక్షణంలోనే ఆ సంకల్పం విరమించుకొని అలాగే కూర్చున్నాడు.

మహారాజది గమనించాడు. వెంటనేఅతని కన్ను లెర్రబడ్డాయి. అయినా ఆ కోపం అంతా లోలోపలే సంబాళించుకొని ఛత్రపాణికి కొంచెం దూరంగా కూర్చున్నాడు.

శాక్యసింహు డది గమనించకపోలేదు. అయినా అది గమనించనట్లుగానే చిరునవ్వులు చిలకరిస్తూ ప్రశాంతస్వరంతో ప్రసేనజిన్మహారాజుతో ఇలాగన్నాడు:

"మహారాజా! ఈయన శ్రావస్తీనగరంలో శ్రావకాభరణుడు! అష్టాంగమార్గ స్రోతాపన్నుడు! త్రిపిటక విద్వాంసుడు! ధర్మనిర్వహణంలో బహుశ్రద్ధాళువు."

అని సమ్యక్సంబుద్ధు డొకమారు ప్రసేనజిత్తు వైపు తిలకించాడు. ప్రసేనజిత్తు భక్తిపూర్వకంగా అంజలిఘటించి ఆయనచెప్పిన దన్నీ అతిశ్రద్ధగా ఆలకించాడు. ఒకమారు మాచీ మాడనట్టుగా ఛత్రపాణివైపు చూచాడు. అంతేగాని "ఓహో! అలాగా!" అనికూడా అనలేదు.

తథాగతుడంతటి మహామహుడు తనవంటి వానిని గూర్చి ఆ విధంగా ప్రసంగించేసరికి ఛత్రపాణి శరీరం పులకరించింది. కంఠంలో గద్గదం బొడచూపింది. ఏదో చెప్పబోయాడు గాని చివరికేమీ అనలేక తిరిగీ బుద్ధదేవుని కొకమారు నమస్కరించి తల వంచుకొన్నాడు. అతని కనుగొలుకులలో బాష్పబిందువులు ప్రవహించాయి.

కోసలదేశాధిపతి ప్రసేనజిన్మహారాజు గుణగణాలభివర్ణించకుండా తనవంటి సామాన్యగృహస్థునుగూర్చి అంత ఆప్యాయంగా ప్రసంగించేసరికి ఛత్రపాణి నిలువునా కరిగిపోయాడు. అయితే అదంతా గౌతమదేవుని అపార కారుణ్యానికే నిదర్శనమనీ, నిజంగా తనలో అంతటి మహత్త్వమేమీ లేదనీ అనుకొన్నాడు. తనవంటి మహారాజక్కడికి విచ్చేయగానే ఛత్రపాణి వెంటనేలేచి ప్రత్యభివాదనం చెయ్యలేదని మహారాజు లోలోపల అట్టుడుకినట్టుడికి పోతున్నాడు. కాని పైకదేమీ కనబడనీయకుండా గంభీరంగా ఒక చిరునవ్వునవ్వి గౌతమదేవునికి పాదాభివందనంచేసి ఆయన కనతి దూరంలో కూర్చుని ధర్మబోధ నాలకిస్తున్నాడు. ఆపైన గౌతమదేవుడు మహారాజును గూర్చి పల్లెత్తు మాటయినా మాటాడకుండా ఛత్రపాణి శ్రద్ధాభక్తులనుగూర్చి ప్రసంగించడం జరిగింది. దానితో ప్రసేనజిత్తు హృదయానికొక పెద్ద అఘాతం తగిలినట్లయింది. అయినా మహారాజత్యంత కౌశలంతో అదంతా లోలోపలే నిగ్రహించుకొన్నాడు. అత్యంత భక్తిశ్రద్ధలతో బుద్ధదేవుని ధర్మబోధ నాలకిస్తున్నట్టు నటించాడు. కాని అతని హృదయం అక్కడలేదు. వెంటనే బయలుదేరి స్వీయభవనానికి వెళ్లిపోవాలని ఉవ్విళ్లూరాడు.

అంతలో బుద్ధదేవుని ధర్మోపదేశంలో ఒక ఘట్టం ముగిసింది. ప్రసేనజిత్తు అది గ్రహించి వెంటనే ఆయనదగ్గర సెలవు తీసుకుని రాజభవనానికి వెళ్ళిపోయాడు. సమ్యక్సంబుద్ధుడు తన ధర్మప్రసంగం ముగించి లేచివెళ్ళేవరకు ఎవరు అక్కడనించి కదలరు. కాని ప్రసేనజిత్తు అవాళేదో అత్యావశ్యక రాజ్యకార్యం నిర్వహింపవలసి ఉన్నదని చెప్పి నెమ్మదిగా అక్కడినుంచి బైట పడ్డాడు.

ఆయన ఆ విధంగా కదిలి వెళ్ళిపోవడం ఛత్రపాణికెంతో విచిత్రంగా కనిపించింది. అయినా గౌతమదేవుని నోట వెలువడే ప్రత్యక్షరము అతిశ్రద్ధగా ఆలకిస్తున్న అతని హృదయంలో ఆ భావం వెంటనే అదృశ్యమైపోయింది.

మరికొంతసేపు ధర్మప్రసంగం జరిగింది. ప్రసంగం ముగియగానే తథాగతుడక్కడినించి లేచి వెళ్ళిపోయాడు. ఛత్రపాణి తిరిగీ ఇంకొకమా రాయనకు పాదాభివందనం చేసి, మళ్లీ తన పాదరక్షలు, ఛత్రము ధరించి నెమ్మదిగా ధర్మగాథాపారాయణం చేసుకుంటూ తన ఇంటికి వెళ్ళిపోయాడు.

ఈవాడు మహారాజసన్నిధిని అరగడియసేపు నిలబడేదాకా అతని కీవిషయాలన్నీ స్ఫురణకు రానేలేదు! కాని ఇప్పుడీ విషయంలో అతని అనుమానం అంతా తీరిపోయింది.

3

ఛత్రపాణి కోసలదేశాధిపతి ప్రసేనజిన్మహారాజు సన్నిధిని నిలబడిన పిమ్మట ఇంకొక అరగడియకూడా గడిచిపోయింది. ఛత్రపాణికి నిలువు జీతంవల్ల లోలోపల, పైన ముచ్చెమటలు పోశాయి. ఆ తరువాత అలాగే ఇంకొక అరగడియకూడా గడిచిపోయింది.

ఛత్రపాణి చాలా సరళవర్తనుడు. కాని మాట, మంతీ లేకుండా మహారాజు కెదురుగా గడియన్నరసేపు నిలబెట్టేసరికి అతని ఓరిమి కాస్తా అంతరించిపోయింది. ఎంతటి మహారాజయితేమాత్రం! తమకు కలిగిన కలిమి అంతా రెండుచేతులా జుర్రుకుంటారు గాని మావంటి అల్పులకేమయినా వినుపుతారా ఏమన్నానా! ఎందు కిందటి మిడిసిపాటు! అనుకున్నాడు ఛత్రపాణి.

అంతలోనే మహారాజు లవోకగా అతి హేళనగా కనురెత్తి అతనివైపు చూచాడు.

"ఓహో! ఛత్రపాణి శ్రావకాభరణులా?"

"చిత్తం! మహాప్రభూ!"

"శ్వేతచ్ఛత్రము, పాదుకలు ధరించ



సుండా విజయం చేశారే!" ఈమాట సూటిగా ఛత్రపాణి గుండెల్లో గుచ్చుకుంది. "మహారాజసన్నిధినికూడా గొడుగు పావలు వేసుకునేటంతటి పామరుణ్ణి కాను మహారాజా!" అన్నాడు ఛత్రపాణి. అతని నుదుటిపై నిలిచిన అంజలి బంధం మరింత దృఢంగా బిగిసింది. అయితే ప్రసేనజిన్మహారాజు ముఖభంగిమలో విసుగు కొంచెం కదిలింది:

"అయితే మీకు తెలుసునన్నమాటే!" అన్నాడు.

"ఏమిటది మహారాజా!"

"అదే! మీరంటూన్నమాటే!—నేను మహారాజునన్న విషయం!"

ఛత్రపాణి కదేమీ బోధపడలేదు. కొంచెం కంగారుపడి మళ్ళీ అతివినయంగా ఇలాగ అన్నాడు:

"తమరు కోసలమహారాజులు కారని నేనెన్నడు కలలోనైనా భావించి ఉండలేదే!"

"భావించారేమోనని అనుకోవలసి వచ్చింది!"

"ఎప్పుడు?"

"నిన్న సాయంకాలవేళ! తథాగతుల సన్నిధిలో!"

ఈ మాటతో ఛత్రపాణికంతా బోధపడిపోయింది. అయినా తన అమాయికత తెలుపుకుంటూ సవినయంగా ఇలా అడిగాడు:

"నావల్ల ఏమైనా అపచారంగాని జరిగిందా?"

"అంతటి అపచారమేమీ జరగలేదుగాని నేను కోసలదేశాధీశ్వరుణ్ణనే విషయమే మీకు తెలియదేమోనని అనుకున్నాను. అంతే!"

ఈ ప్రత్యుత్తరంతో ప్రసేనజిత్తు చేసిన అధిక్షేపం అంతా ఛత్రపాణికి తెలిసిపోయింది. అతడలాగే ఫాలంపై అంజలిబంధం ఘటించి కొంచెం వ్యంగ్యధోరణిలో ఇలాగన్నాడు:

"మహారాజా! తామూ కేవలం కోసలదేశాధీశ్వరులుమాత్రమే! అయితే మహారాజాధిరాజు లెందరెందరో తథాగతుల పాదపద్మరేణువులు తమ శిరస్సులపై అలంకరించుకొంటున్నారు! సమ్యక్సంబుద్ధులు చతుర్దశ భువనాలు తమ చల్లని చూపులతో పరిపాలించే రాజరాజేశ్వరులు! అయినా వారపార కరుణాసాగరులు! అటువంటివారి సన్నిధిలో తమ కభివాదం చెయ్యడం తమకే ప్రత్యవాయహేతువు కాగలదనే భయంతోనే నేను తమ కభివాదనం చేసి ఉండలేదు. అదీగాక క్షణభంగురములైన భాగ్యభోగాలు చూచుకొని అంతగా అహంకరించవలసిందిమాత్రం ఏమిఉన్నది మహారాజా! అందులోను శాక్యసింహులవంటివారి సన్నిధికివెళ్లినా, ఇంకా ఈ క్షుద్రాహంకారాల ఆర్భాటమేనా? ఇంతకీ నావంటి అల్పాల్పుడు తమకు ప్రత్యేకంగా విన్నవించవలసినదిమాత్రం ఏమిఉన్నది మహారాజా!" అని ఛత్రపాణి ఒక చిన్న చిరునవ్వు విసిరాడు.

ఈ ప్రత్యుత్తరంతో ప్రసేనజిత్తు పూర్తిగా చిత్తయిపోయాడు. అతనికిక నోటిమాట రాలేదు. అయినా కొంచెం సంబాళించుకుని అతికష్టంమీద ఒక చిరునవ్వునవ్వి "అవునవును! నాకది తెలియకపోలేదు! ఇంతకీ మిమ్మల్నిక్కడికి పిలిపించిన కారణం వేరు!" అన్నాడు.

నిజానికి ప్రసేనజిత్తు ఛత్రపాణి నక్కడికి పిలిపించిన దందుకోసమే. అతడు లోనికి రాగానే తన అక్కసంతా ఒక్కసారిగా వెళ్లగక్కాలని అనుకున్నాడు. అయితే అమాయిక సరళము, సుప్రసన్నము అయిన ఛత్రపాణి ముఖం చూడగానే మహారాజు క్రోధం చాలావరకు చల్లారిపోయింది. ఆపైన ఛత్రపాణి సాభిప్రాయంగా విసిరిన విసుర్లు వినగానే అతని హృదయంలో కొంచెం పశ్చాత్తాపంకూడా బయలుదేరింది.

అయితే అదేసమయంలో మహారాజు మనస్సులో ఒక చిన్న ఆలోచన స్ఫురించింది. ఛత్రపాణిపై అనుగ్రహదృష్టి ప్రసరింపజెయ్యాలనీ, ఆవిధంగా తిరిగి అతనిని కొంచెం కించపరచాలనీ అనుకున్నాడు. అల్పులపై అహంకారాధికారాలు చలాయించలేనివారు తమ అనుగ్రహంద్వారా వారిని కించపరచాలని అనుకుంటారు. ఇది మానవహృదయంలో ఉదయించే అతిసూక్ష్మమైన క్రూర ప్రతీకారదృష్టి!

కోసలాధిపతికి సరిగా అలాంటి సంకల్పమే కలిగింది. ఆవిధంగా ఛత్రపాణిపై తిరిగి తన మహాత్త్వం ప్రతిష్ఠింపజెయ్యవచ్చుననీ తద్వారా అతని అల్పత్వం నిర్దేశించవచ్చుననీ అనుకున్నాడు. ఇదంతా ప్రసేనజిత్తు హృదయాంతరాళంలో స్పష్టాస్పష్టంగా, తలవని తలంపుగా బయలుదేరిన ఆలోచన. వెంటనే లోలోపలలేని ఆదరాభిమానాలు వ్యక్తీకరిస్తూ మెత్తగా ఇలాగన్నాడు:

"మిమ్మల్ని నేనొక చిన్న సాహాయ్యం అర్థిస్తున్నాను!"

"నేనా? తమకా? సాహాయ్యం చెయ్యడమా? ఎంతమాట సెలవిచ్చారు!"

"తథాగతులు మిమ్మల్ని సాక్షాత్తు శ్రావకాభరణులని ప్రశంసించి ఉన్నారు."

"అది కేవలం వారి అపార కరుణకు మాత్రమే తార్కాణం! అంతే! ఇంతకీ తమ ఆజ్ఞ?"

"మహారాణులు మీదగ్గర త్రిపిటక ధర్మప్రవచనం వినవలెనని కుతూహలపడుతున్నారు!"

దానికి ఛత్రపాణి తిరిగి అతి వినయంగా ప్రత్యుత్తరం ఇచ్చాడు:

"మహారాజా! అవన్నీ శారీపుత్ర మౌద్గల్యాయనుల వంటివారో, లేక సాక్షాత్తు తథాగతులోని వ్యాఖ్యానించవలసిన విషయాలు! నేనీ విషయాలలో కేవలం అజ్ఞుణ్ణి! నన్ను మన్నించండి!"

అది విని మహారాజు—"మీరు తిరిగి నన్ను కించపరుస్తున్నారు!" అన్నాడు.

"ఎంతమాట! మిమ్మల్ని కించపరచడానికి మేమెంతటివాళ్ళం! అదీ గాక నేను బొత్తిగా రాజమర్యాద తెలియని పామరుణ్ణి! ఆ పైన అంతఃపురమర్యాదలకు నాకుంసగ మెరుక! దయ ఉంచి నాకిక సెలవిప్పించండి! ఇది నావల్ల జరిగేపనిగాదు, గౌతమ బుద్ధులకు తమ అభిలాష తెలియజేస్తే వెంటనే వారర్హతుల నెవరినైనా తమ అంతఃపురానికి పంపించగలరు! నామీద అనుగ్రహం కొద్దీ తమరిలాగ సెలవిచ్చారు గాని నేనందుకు తగినవాణ్ణిగాను. ఇక నాకు సెలవా మరి!" అన్నాడు ఛత్రపాణి.

తన ప్రార్థన విని ఛత్రపాణి ఉబ్బితబ్బిబ్బైపోగలడనీ ఆవిధంగా తన మహాత్త్వం అతనికి చవి చూపించవచ్చుననీ ప్రసేనజిత్తెంతో ఉబలాటపడ్డాడు. కాని అది నెరవేరలేదు. అతనికి జరిగిపోయినదానికంటె ఇదే ఒక గొప్ప అవమానంగా కనిపించింది! అయినా ఇక ఏమనడానికీ పాలుపోక ఒక్క చిరునవ్వు నవ్వాడు:

"సరే మరి! మీవంటివారిలాగంటే ఇక నే నేమనగలను!"

ఛత్రపాణి ఆమాట వింటూనే మహారాజుపై ఒక నమస్కారం బాణం విసిరి వెంటనే ఒక్క అంగలో రాజభవనందాటి ఇవతల పడ్డాడు!

వెనక్కి తిరగగానే అతని కొక పెద్ద నిట్టూర్పు వినిపించింది! ★

స్థాపితము: 1920 సంll రం.
సమస్త చర్మవ్యాధులకు,
తెలుపు మచ్చలు వగైరాలకు చికిత్సా నిపుణులు.
కేటలాగు, సలహా ఉచితము.
రెడ్డి & కో, (రిజిష్టర్డ)
గోపాలపురం తూర్పుగోదావరి జిల్లా
(వయా) తెణుకు.